# తీరని కష్టం

శ్రీ చెరుకువాడ శ్రీరామమూర్తి

ఫారెష్టు ఆఫీసర్ని కలుసుకోవడానికి వెళ్లి రహదారీ బంగళా రెండో భాగంలో శాంతమ్మను చూశాను. ఆమె సీనియర్ ఇన్‌స్పెక్ట్రిస్ ఆఫ్ స్కూల్సు హోదాలో నేను విష్ చేస్తే తెలియనట్లు నటించడమే నాకు ఆశ్చర్యం కలిగించింది.

బంట్రోతు కుర్చీ తెచ్చి వరండాలో వేసి "దొరగారు స్నానం చేస్తున్నారు! పది నిమిషాలు కూర్చోండి!" అన్నాడు.

కుర్చీలో కూలబడి శాంతమ్మ కథ చెప్పకున్నాను!

మా చింతచెట్టు దొడ్లో చిన్నడు మరో యిద్దరి సాయంతో కర్రలు కోస్తుండేవాడు. మా రామం నేను ఆడుకోవడాని కక్కడికి వెళితే "చిన్న పావుకోరుబాబు......... దూరంగా వుండండి బాడిత తగులుతుంది" అనేవాడు కర్రచెక్కటం ఆపివేసి. మేం దూరంగా వెళ్లి చూస్తూ నిలుచుండేవాళ్లం. కర్ర ఒకప్రక్క బల్లపరుపుగా చెక్కి కాగురురంగు నీళ్ళతో ముంచిన నూలు కోడుతో నూళ్ళు వేసి... మధ్యనూలుకు తూకంకట్టి - కర్రబోర్లించి రెండవవైపు కూడా బల్లపరుపుగా చెక్కి నూళ్ళు వేసేవాళ్లు! తరువాత చిన్నడు "సర్దుకోండిరా! ౧ండెక్కింది" అనేవాడు. తక్కినయిద్దరు తలపాగాలు సవరించుకొని గోతి మీద అడ్డంగా వేసిన బాజుల మీదికి నూళ్లు వేసిన కర్రను ఎక్కించి గోతిలోనికి దిగేవాళ్లు. చిన్నడు రంపం తీసికొని కర్రమీదకెక్కి రంపం కర్ర మందలమీదనుంచి క్రిందికి దింపేవాడు. క్రిందనున్నవాళ్లు రంపం తొక్కి పిడి బిగించాక కోత ఆరంభ మయ్యేది.

పైన కోస్తున్న చిన్నడు, క్రింద లాగుతున్న ఇద్దరు కూడా రంపం జోగురు రంగుగీత తప్పిపోకుండా, కోస్తుండే వాళ్లు. మాటి మాటికి చిన్నడు ముక్కుమీదికి లేస్తుండేది రంపం! అయినా... చిన్నడు... జోగురు రంగు గీత మీదే దృష్టి స్థిరంగా వుంచి... రంపం క్రిందికి త్రోసేవాడు. ప్రతిసారి రంపం చిన్నడి ముక్కులో గుచ్చుకుపోతుం దనే భయంకన్నా వాని స్థిరత్వం నన్ను ఆశ్చర్యంతో ముంచేది.

స్కూల్లో పెద్ద తరగతి చదువుతున్న రోజుల్లో! ఓనాడు చిన్నడు వచ్చి మా నాన్నగారితో "నా భార్యపోయింది... నాపిల్లలు నేను ఏం కావాలి బాబు" అని ఏడ్చాడు. అప్పుడు తెలిసింది చిన్నడికి ముగ్గురు ఆడపిల్లలు, యిద్దరు మొగపిల్లలు అని!

శాంతమ్మ; మేరీ; ఎమిలీ; వరసగా ఆరో ఫారము అయిదో తరగతి నాలుగో తరగతి చదువు తుండేవాళ్ళు. వీళ్లంతా స్కూల్లో నాకు తెలుసు కానీ చిన్నడి కూతుళ్లు కొడుకులు అని తెలియదు. జార్జి ఎలిమెంటరీ స్కూల్లో చదువుతున్నాడట.

నాన్నగారు చిన్నడికి పాతిక రూపాయ లిచ్చి పంపించారు. తల్లిలేని పిల్లల్ని... రంపం కోతమీద వచ్చే కొద్ది ఆదాయం తోనే చిన్నడు పోషిస్తూ చదివిస్తుండే వాడు. స్కూల్లో వాళ్లకి జీతం ఉచితమే. ఐనా పుస్తకాలకు బట్టలకు భోజనాలకు అయ్యే ఖర్చు భరించవలసి వచ్చేది. అందుకోసం... చిన్నడు మధ్యాహ్నం తక్కిన ఇద్దరి కోతగాళ్లతో భోజనానికి విశ్రాంతికి ఇంటికి పోకుండా చింతచెట్టు క్రింద కూర్చొని రంపం పదును పెడుతూ వుండే వాడు.

నేను కాలేజీలో చదువుతున్న మూడేళ్లు చిన్నడి జీవితచరిత్ర తెలియదు. శాంతమ్మ మాత్రం ఒకరోజు కనిపించి, తాను మిషను వాళ్ల సహాయంతో కాలేజీలో చేరానని చెప్పింది.

నలభై రెండులో నాన్నగారు చని పోయారు. నేను కాలేజీ వదిలేసి రెండేళ్లయింది. నా జీవితంలో పెద్ద మార్పు కలిగింది. అప్పటివరకు బడిపిల్లవాడి ననుకుంటున్న నా మీద సంసారం... బరువు పడింది.

చిన్నడు రంపం కోస్తూనే వున్నాడు. కానీ పాపం సంవత్సరము క్రితం పెద్ద జబ్బు పడ్డాడట. మనిషి చాలా నీరశించాడు! అకస్మాత్తుగా ముసలితనం పైబడింది. శాంతమ్మ బి. ఇ. డి., చదువుతోంది. మేరీ స్కూల్లో పెద్ద తరగతిలోనికి వచ్చిం దని చిన్నడు చెపితే విని సంతోషించాను.. పిలిప్సును చదువు మానిపించి, రంపం పనిలో పెట్టాడు...!!

"కొడుకుని రంపంకోతలో పెట్టి కూతుళ్లని చదివిస్తున్నావా?" అన్నాను... చిన్నడు మాట్లాడలేదు.

ఆ సంవత్సరం నవంబరులో శాంతమ్మ నాకో వుత్తరం వ్రాసింది... స్టైఫండు ఇంకా రాలేదనీ... తను వెంటనే హాస్టలు ఫీజు చెల్లించకపోతే హాస్టల్లో వుండనీయరనీ ... అందుకుగాను నన్ను ధనసహాయం వేడింది ... అంగులో అవే సంగతులు చిన్నడికి వ్రాసి పంపింది. చిన్నడి కావుత్తరం చూపి వాడిని బాధ పెట్టడం దేనికని... మరునాడు శాంతమ్మకు నూరు రూపాయిలు పంపించాను.

తరువాత సంవత్సరానికి శాంతమ్మకు ఆడపిల్లల బళ్లో వుద్యోగమయిందని చిన్నడు చెప్పాడు! "ఏమి పంపుతున్నదిరా?" అని నే నడిగితే "దాని బ్రతుకది బ్రతుకుతున్న దండి" అని ముఖం త్రిప్పుకొని జవాబు చెప్పాడు— పాపం వాడి ముఖంలో.. కష్టం... చేసిన... నీరసం కనిపించింది. అయినా కొందరు జీవితమంతా త్యాగం చేస్తేనేగాని.... వాళ్ల సంతానం అభివృద్ధిలోనికి రాలేరేమోనని నా భయం...

"దొరగారు రమ్మన్నారండి! అన్నాడు బంట్రోతు వచ్చి... ఆలోచనలనించి మేల్కొని... లోపలికి వెళ్లాను. చిన్నడింకా రంపం కోస్తూనే వున్నాడు... వానికి కూతుళ్లను విద్యావంతుల్ని చేసిన సంతోషమే మిగిలింది కాని మామూలు కష్టం తప్పలేదు. ★

---


## అద్భుత ఫలితములు

మీ ఆర్థిక రాజకీయ, సాంఘిక, తదితర సమస్యలు, రానున్న ఎన్నిక ఫలితములు అద్భుతముగా జోస్యముచెప్పబడును. జననకాలము లేక ఉత్తరము వ్రాయుకాలముతో సహా రు. 5-0-0 పంపవలెను. ప్రొ. ఏ. ఆర్. ఆదూరి

జ్యోతిష, సాముద్రిక, సాంఖ్యాశాస్త్రవేత్త

ది మిరకిల్ హౌస్, కాకినాడ.